# ఊబి

ఉద్యోగంలో చేరిన తరువాత, నేను రాజమండ్రి రావటం ఇదప్పుడే ఆరోసారి.

అంతకుముందు అయిదుసార్లూ కూడా లతనే చూద్దామని అనుకున్నాను....!

కాని ఒకవిధమైన పిరికితనం వల్లనో లేకపోతే బాధ్యత కలిగిన ఉద్యోగస్థునిగా నా కిప్పుడు ఒకరకమైన గౌరవం ఉందని నే నను కోవటం వల్లనో. ధైర్యంచేసి ఆమె దగ్గరకు వెళ్ళలేకపోయాను....

ఇప్పటికి ఎనిమిదేళ్ళ క్రితం.... ఔను....! సరిగ్గా ఎనిమిదేళ్ళ క్రితమే - నేను మొదటిసారిగా లతను చూశాను. అప్పుడు అమలాపురంలో బి.ఏ. చదువుతుండేవాడిని.... జేబునిండా డబ్బు, ఆలోచనల నిండా అల్లరితనం ఉండే రోజులవి....

అప్పట్లో కోటేశ్వర్రావని నాకో ఫ్రెండుండేవాడు.... అంటే. అప్పట్లో నాకు ఒక్కడే ఫ్రెండుండే వాడని కాదర్థం....! చాలామంది ఉండేవారు. అందులో కోటేశ్వర్రావ్ నాకు బాగా దగ్గర! వాళ్ళ నాన్నకి అమలాపురంలో రెండెకరాల కొబ్బరితోట వుండేది. కాలవ గట్టున సినిమాహాలు పక్కన కాఫీహోటలు కూడా వుండేది.

మే మిద్దరం కలసి గణపతి నవరాత్రుళ్ళు సీజనులో, అప్పుడు- ఆదే.... ఎనిమిదేళ్ళక్రితం— ఓసారి రాజమండ్రి వచ్చాం....! హోటల్లో మకాం....

ఆ రాత్రి మొదటాట సినిమా చూశాక, నన్ను లతావాళ్ళింటికి తీసుకెళ్ళాడు కోటేశ్వర్రావు.

ఆ గుమ్మంలో అడుగుపెట్టగానే- ఏభై ఏళ్ళు పైబడిన ఒకామె ఎదురయింది.... మమ్మల్ని చిరునవ్వుతో ఆహ్వానించింది.

హాల్లో వున్న కుర్చీల్లో కూర్చున్నాం.

కోటేశ్వర్రావు ఆవిడితో ఏదో మాట్లాడేడు....

నాకేం వినిపించలేదు. నాకంతా కొత్తగానూ, భయంగానూ వింతగానూ వుంది. ఆతర్వాత ఆవిడ చేతిలో రెండు పదిరూపాయల నోట్లుంచాడు కోటేశ్వర్రావు.... వాటిని తీసుకొని లోపలకు వెళ్ళి పోయిందావిడ.

మళ్ళీ రెండు నిముషాల్లో తిరిగివచ్చి-

"రండి !"- అంది.

కోటేశ్వర్రావ్ లేచాడు. యాంత్రికంగానే నేనూ లేచాను. కుడి చేతివైపు నున్న గదిలోకి వెళ్ళమంది కోటేశ్వర్రావ్ని... దాని ప్రక్క నున్న ఇంకో గది నాకు చూపించింది....

లోపల కెళ్ళాను....

ఆగదిలో దీపం గుడ్డిగా వెలుగుతోంది.... గోడ నానుకొని ఓ మంచం ఉంది. ఆ మంచం పక్కనే టేబులూ, కుర్చీ !... టేబులు మీద కూజా, గాజుగ్లాసు వున్నాయి; దాని ప్రక్కనే గోడమీద అద్దం వ్రేలాడుతోంది. ఆ అద్దం ముందు నిలబడ్డ అమ్మాయి ముఖానికి పౌడరు రాసుకుంటోంది...

"రండి ! కూర్చోండి !"- నావైపు పూర్తిగా చూడకుండానే తన పని తాను చేసుకుంటూ అన్నదా అమ్మాయి.

కుర్చీలో కూర్చున్నాను.

నరాలు బిగుసుకుపోతున్నట్లు అనిపించింది ..ఆమెవైపు చూడాలంటే ధైర్యం చాలనంత భయం కళ్ళల్లో నిండిపోయింది...

అయినా ఆమెనే గమనిస్తున్నాను.

పౌడరు రాసుకోవటం అయిన తర్వాత— బల్లమీదవున్న అరిటాకు పొట్లం విప్పి-అందులోంచి మల్లెపూలచెండు తీసి-తలలో పెట్టుకుంది. గూట్లోంచి ఓ సీసాతీసి-అందులోవున్నదాన్ని గాజుగ్లాసులోకి వంపి-ఆపై కూజాలోని నీళ్ళుకూడా పోసుకుని - ఒక గుక్కలో దాన్ని తాగేసింది.

అయిదునిముషాలు గడిచేయి...

"ఏమీ మాట్లాడవేమిటి ? అడిగింది. మంచంమీద కూర్చుని.

"ఏం మాట్లాడాలి ?"- అనుకున్నాను.

"టాయ్‌లెట్ అవుతున్నావ్ కదా — అని !" తెచ్చిపెట్టుకున్న నవ్వుతో చెప్పేను.

"ఏవూరు మనది ?"- అడిగింది జాకెట్టును కిందకు లాక్కుంటూ చెప్పేను.

"సిగరెట్టుందా ?"-

"లేదు !" - అప్రయత్నంగా జవాబు చెప్పినా - ఆ క్షణంలో ఆమెను అడగాలనిపించింది. 'నువ్ సిగరెట్టు కాలుస్తావా? అని.. కానీ అడగలేకపోయాను.

"నీ పేరేమిటి?" అనిమాత్రం అడిగాను.

"లత!" చెప్పిందామె.

"చదువుకున్నావా?"

నా ప్రశ్నలు విని పిచ్చివాడ్ని చూసినట్టు నావైపు చూసింది.

"చదువుకోలేదు! అయినా అవన్నీ నీకెందుకూ? నువ్ సుఖం కోసం వచ్చావ్! ఆ పనేదో చూసుకుని వెళ్ళిపోవచ్చుగా?" ఆమె మాటల్లో మార్దవం లేదు.

నిజమే...

తమలాంటి వాళ్ళకోసం వచ్చే మగవాళ్ళమీద వాళ్ళకు సదభిప్రాయం ఎలా వుంటుందీ?....

ఆమె దగ్గరగా వెళ్ళాను.

"ఏం? నీ గురించి తెలుసుకోకూడదా?" అన్నాను మంచంమీద ఆమె పక్కనే కూర్చుంటూ.

"తెల్సుకోవచ్చు! కానీ ఏంటి లాభం? తొందరగా మీ పనూచుసుకుని వెళ్ళిపోతే ఇంకో పేసింజెరు వచ్చేదాకా మాకు రెస్టు దొరుకుతుంది!" చెప్పింది లత.

ఆమె మాట్లాడుతూంటే ఏదో ఘాటైన వాసన...! ఓసారి అలాంటి వాసనే కోటేశ్వర్రావ్ దగ్గర వచ్చింది. 'ఏమిటని అడిగితే 'విస్కీ' తాగేనన్నాడు.

అంటే ఇంతక్రితం సీసాలోంచి లత తాగింది కూడా విస్కీ అన్నమాట....

"మీ పేరేంటీ ?" నేనేదో ఆలోచిస్తూంటే లత అడిగింది చెప్పేసు.

చూపుడు వ్రేలితో - తన పెదాలమీద కొట్టుకొంటూ — "ఉ! ముద్దెట్టుకో" అంది.

రంగువేసుకోవటం వల్లనో, లేకపోతే కిళ్ళీవేసుకోవటం వల్లనో, ఆమె పెదాలు ఎర్రగా ఉన్నాయి.

"నువ్ తాగుతావా ?" అడిగేసు.

"నేనే కాదు ! ఇక్కడున్నవాళ్ళందరం తాగుతాం ! లేకపోతే మీలాంటి పేసింజర్లు పెట్టే బాధలకు తట్టుకోవద్దూ ?"

"రోజూ తాగితే మీ ఆరోగ్యం చెడిపోదా ?"

'మాకో డాక్టరమ్మ వుంది. వారం వరం వచ్చి, అందరినీ 'చెకప్పు' చేస్తుంది. మందులూ ఇంజిక్షన్లు ఇచ్చి వెడుతుంది."

"ఈ వృత్తిలో నువ్వెంతకాలంనుంచీ వున్నావేమిటి ?

"పదేళ్ళయిపోయింది.... ఓ సచ్చినాడు సినిమాలో వేషం ఇప్పిస్తానని మెడ్రాసు తీసుకెళ్ళాడు. అక్కడో ఓటల్లో వన్నొదిలేసి వాడెక్కడికో చెక్కేసేడు. అప్పుడే ఈ వృత్తిలోకి దిగిపోయేను.... అంతా కొత్త.... పైగా పోలీసోళ్ళ గొడవటీ ! రచ్చణ కావాలిగా ! అప్పుడే ఎవరో చెప్తే ఈక్కడికొచ్చి పడ్డాను !" తాగిన మందుతాలూకు మత్తు ఆమె కళ్ళలో కనిపించింది.

"రోజూ ఎంతమంది పేసింజర్లొస్తారేమిటి ?" మళ్ళీ అడిగేను.

"ఎంతమందొస్తే నీ కెందుకూ ?.... తొందరగా పనికానిచ్చి వెళ్ళిపో !" మంచంమీద వెనక్కి వాలిపోతూ అంది.

నేనింకొంచెం దగ్గరగా జరిగేసు.

ఆమె చూపు నా చొక్కా జేబుమీద పడింది.

"ఎంతుందేమిటి డబ్బు ?"- జేబులో చనువుగా చెయ్యి పెట్టేస్తూ అడిగింది. నేను సమాధానం చెప్పేలోగానే, జేబులోంచి డబ్బంతా తీసుకొని లెక్క పెట్టింది.

"చాలానేవుందే ! ముప్పయ్‌రెండ్రూపాయలు !"- మళ్ళీ వాటిని జేబులో పెట్టేస్తూ-రెండ్రూపాయల కాగితాన్ని మాత్రం తీసుకుంది.

"ఈ రెండూ నేను తీసుకోనా ?" అడిగింది లత.

"మీ ఓనరుకి డబ్బు ఇచ్చేశాంగా !" చెప్పేను.

"ఇస్తేనేం ?.... వేరే ఇవ్వకూడదా ?" నా వేలినున్న ఉంగరాన్ని తిప్పుతూ అడిగింది.

"నేనడిగితే విషయాలు చెప్పటంలేదుకానీ—నీకు వేరే డబ్బెందుకివ్వాలీ ?" అడిగేను నవ్వుతూనే.

"ఏం చెప్పాలి ?" కొంచెం విసురుగానే ప్రశ్నించింది.

"అదిగో.... ఆ స్పీడే వద్దంటున్నాను. పోనీలేగానీ, నీకు ఎంత గిట్టుబాటవుతుందో చెప్పు ?"

"రోజుకి అయిదురూపాయలిస్తుంది ఓనరు.... అదికాకుండా పొద్దున్న కాఫీ మధ్యాహ్నం టీ !.... రెండు పూట్లా బోజనం !.... అంతే వొచ్చిన పేసింజర్లకి ఎవళ్ళం నచ్చితే ఆళ్ళం వెళ్ళాల్సిందే. రోజుకి ఎంతమందొచ్చినా కాదనకూడదు. వాళ్ళ దగ్గర ఓనరు ముందుగానే డబ్బు తీసుకుంటుంది.... బయట లాడ్జీలకు పోతేనే మాకు సుకంగా వుంటుంది."

"బయటి లాడ్జీలకు కూడా వెడతారా ?"

"ఎవరైనా వచ్చి 'బుక్' చేసుకుంటే వెళ్తాం !" రేత్రికంతా రేటు వంద. అందులో మాకు ముప్పై, ఓనరుకి డెబ్బై.... ఇంకా బ్రోకర్లుంటే. వాళ్ళకి మా ముప్పయ్‌లోంచే అయిదూ, పదీ ఇవ్వాలి ; కానీ లాడ్జీల్లో అయితే పేసింజర్లు బాగా తాగుతారు. వాళ్ళతో బాటు మేమూ బాగా తాగొచ్చు. సుబ్బరంగా చికెనూ, మటనూ కూడాతినచ్చు ! ఉత్సాహంగా చెప్పింది.

"మరి కాఫీలూ, భోజనం అన్నీ ఓనరే చూస్తుందిగా. ఇంక ఈ డబ్బేం చేస్తారూ ?"

"డబ్బుంటే చేదా ?.... అప్పుడప్పుడు ఓనరు పర్మిషనిస్తే మోర్నింగ్ షోలకు వెళ్తాం.... ! కానీ నేను ఎక్కువగా సినిమాలు చూడను. నా కూతురికి బట్టలు కుట్టిస్తాను !"

"పిల్లలున్నారా నీకూ ?" కొంచెం ఆశ్చర్యపోతూనే అడిగేను.

"ఒక్కత్తే !.... అయిదోక్లాసు చదువుతోంది !"

"అయితే చదువుకూడా చెప్పిస్తున్నావన్నమాట !"

"ఆ ! అది చదువుకొని ఉద్యోగంచేస్తే ఎవడో ఒకడు లవ్వాడి పెళ్ళిచేసుకుంటాడు. దాన్నిమాత్రం ఛస్తే వృత్తిలో పెట్టను. చదువు రానిదాన్ని కనకా, ఆ సచ్చినోడు నమ్మించి దగాచేసిపోయాడు కనకా ఈ ఊబిలో దిగిపోయాను. నా కూతురికి నేనున్నాను. దర్జాగా బట్టలు కుట్టించి చదివిస్తాను" భవిష్యత్తును ఊహిస్తూ చెబుతున్న లత కళ్ళల్లో తడి కదిలింది.

అంతలోనే మళ్ళీ ఏదో గుర్తుకొచ్చినట్టు చటుక్కున లేచి, మంచం క్రిందనున్న రేకుపెట్టెను బర్రున బయటకులాగి, అందులో గుడ్డల అడుగున ఉన్న ఓ ఫొటోతీసి నాకు చూపించింది.

"ఇదిగో.... నా కూతురు.... పారిజాతం!.... బాగుందా?" ఫోటో నాచేతికిస్తూ అడిగింది.

ఫోటోలోకి చూశాను. గుండ్రని ముఖం.... రెండుజడలు.... విశాలమైన కళ్ళు.... అందంగానే కనిపించింది.

"నీ కూతురు ఇక్కడ ఉండటంలేదా?" ఫోటోను తిరిగి ఆమెకు ఇచ్చేస్తూ అడిగేను.

"ఇక్కడే వుంటుంది! కానీ అది మేడమీద గదిలోనే వుంటుంది. కిందికి రానివ్వం. మా ఓనరుకింద మొత్తం మేం ఆరుగురం ఉన్నాం. ఆరుగుర్లోకి నాకూ సరస్వతికే గిరాకెక్కువ!"

"ఏం? తక్కినవాళ్ళు బాగుండరా?"

"బాగుండ్రా అంటే బాగానే వుంటారు. కానీ... మరి ఎందుకో...!" సరిగా చెప్పలేకపోయిందో, లేకపోతే మరొకర్ని విమర్శించటం వాళ్ళ వృత్తిధర్మం కాదో నాకు అర్థం కాలేదు.

'రెండ్రూపాయలు తీసుకోనా, వద్దా?" నేను ఆలోచిస్తూంటే మళ్ళీ అడిగింది రెట్టిస్తూ.

"తీసుకున్నావ్‌గా! వద్దంటే మానేస్తావా?"

అందరిమాట నాకు తెల్వదుకాని, నేను మాత్రం పేసింజర్లు ఇష్టపడి ఇస్తేనే తీసుకుంటాను." గూట్లో వున్న ఓ సీసా రేకు డబ్బాతీసి దానికున్న పొడపైన రంధ్రంలోంచి, ఆ రెండ్రూపాయల కాగితాన్ని అందులో వేస్తూ చెప్పింది.

"డబ్బు చాలానే దాచినట్టున్నావే ?" అన్నాను డబ్బావైపు చూస్తూ.

"అంతా కలిపి వందుంటుందేమో ! నా కూతురు పెళ్ళయ్యేదాకా. మీలాంటి పేసింజర్లు ఇచ్చే డబ్బు ఇలాగే దాస్తాను, చదూకున్నాక ఉద్యోగం కావాలంటే లంచం ఇవ్వాల్టగా ?... ఓస్సారి ఓ స్టూడెంటు కుఱ్ఱాడు చెప్పేడు. నా కూతురు బాగా చదువుకున్నాక ఈ డబ్బంత ఇచ్చి ఉద్యోగం కొనిపెడతాను" చెప్పింది లత.

నాకు నవ్వొచ్చింది.

తను పతనమైపోయిన సంగతి తనకు తెలుసు. ఆ విషయాన్ని తను నిర్భయంగా చెప్పుకుంటోంది.

ఆడదానికో నీతి, మగవాడికో నీతి ఉంటాయని ఏ శాస్త్రం ఎప్పుడు చెప్పిందో తెలియదు కాని, చెడిపోవటమనేదాన్ని, తనకే అన్వయించుకుంటుంది తప్ప, తన నుంచి సుఖం కొనుక్కోవాలని వచ్చే మగాడికి అంటగట్టదు స్త్రీ ఇదెక్కడి రూలో మరి ?...

బహుశా తను ఈ ఊబిలోంచి బయటపడి రాలేదుకనుకా, వచ్చినా సమాజం మెచ్చుకోదనే భయం నల్లనెత్తుర్లా నరాల్లో ప్రవహించటంవల్లా తనను తాను అలా కించపరచుకుంటుందా ?

ఏమో మరి !

కానీ, తన రక్తాన్ని పంచుకొని పుట్టిన తన కూతురు మాత్రం తనలా కాకుండా, స్వేచ్ఛగా, పవిత్రంగ బతకాలని కోరుకుంటుంది. ఆశ మనిషిని బతికిస్తుంది. అందుకే ఆమె బతుకుతోంది...

అలా చాలాసేపు ఆలోచించేను.

తిరిగి వచ్చేస్తూ.

"ఈ డబ్బుంచు.... నీ కూతురికి పుస్తకాలు కొనటానికి పనికి వస్తుంది! బాగా చదివించు!" నా దగ్గరున్న ముప్ఫైరూపాయలు కూడా ఆమె చేతిలో పెట్టాను.

ఆ క్షణంలో, ఆమె కళ్ళల్లో ఒక రకమైన సంతృప్తిని చూడ గలిగేను...

అంతే!!

ఆ తర్వాత నేను బి.ఏ. పాసవటం. పై చదువుల కోసము హైదరాబాదు వచ్చేయటము చదువయిపోగానే ఉద్యోగంలో చేరిపోవటం, పెళ్ళికూడా చేసుకోవటం అన్నీ కేవలం నాలుగయిదేళ్ళ వ్యవధిలో వరుసగా జరిగిపోయాయి...

నాకిపుడు బాధ్యతకలిగిన ఉద్యోగం ఉంది. అందుకే, ఆఫీసు పనిమీద అప్పుడప్పుడు రాజమండ్రి వచ్చినా లతను కలుసుకోవటానికి సాహసించలేకపోయాను.

లత ఇప్పుడెలా వుందో? లత కూతురు ఈపాటికి కాలేజీలో చదువుతుండాలి. తనకూతురు భవిష్యత్తుకోసం ఈ ఎనిమిదేళ్ళుగా లత ఎంత డబ్బు కూడబెట్టిందో?

ఒక్కసారి ఆమెను కలుసుకుంటేనే తప్ప ఈ విషయాలు తెలియవు. అసలు తెలుసుకోవాలనే ఆసక్తి నాలో ఎందుకు కలుగు తుందో నాకే అర్ధం కాదు.

అయినా తెలుసుకుంటే తప్పేముంది?

ఇప్పటికి అయిదుసార్లు వచ్చినా ధైర్యం చేయలేకపోయాను.

ఈసారి ఏమైనా సరే లతను చూడాలి.

నేనిప్పుడు తల్చుకుంటే లత కూతురుకి నిముషాలమీద ఉద్యోగం ఇవ్వగలను ! ఆ అధికారం నాకుంది.

'వాచీ' చూసుకున్నాను అయిదయింది. రాత్రి తొమ్మిదింటి వరకూ నాకు ట్రెయిన్ లేదు.

గబగబా బట్టలు వేసుకొని 'రూం' లోంచి బయటకొచ్చేను. తాళంవేసి, ఆ వీధిలోంచి రోడ్డుమీదకు వస్తుంటే కోటేశ్వర్రావ్ ఎదురయ్యేడు.

వాడే నన్ను చటుక్కున గుర్తుపట్టి పిలిచేడు.

"ఏమిట్రా ఇక్కడ ప్రత్యక్షమయ్యావ్ ?" అన్నాడు.

నేను చెప్పబోయేటంతలో వాడే మళ్ళీ—

"ముందు రూంలోకి పోదాం....రా ! అక్కడ మాట్లాడుకుందాం!" అని ఆహోటల్లోనే తానున్న గదిలోకి లాక్కుపోయాడు.

ఆ రూంలో అడుగుపెట్టగానే అక్కడ కనిపించిన అమ్మాయిని చూసి కొంచెం ఆశ్చర్యపడ్డాను.

కోటేశ్వర్రావు క్యారెక్టర్ నాకు బాగా తెలుసుకాబట్టి "నీభార్యా?" అని ధైర్యంచేసి అడగలేకపోయాను.

నాకు కుర్చీ చూపించి బోయ్‌ని పిలిచి కాఫీకి ఆర్డరిచ్చాడు.

"ఇప్పుడు చెప్పు ! ఏం చేస్తున్నావు ? జీతం ఎంత ?" డబుల్ కాట్ మీద ఆ అమ్మాయి పక్కనే కూర్చుంటూ అడిగేడు కోటేశ్వర్రావు

అన్ని వివరాలు చెప్పేసు.

"మరి ఇంతదూరం వచ్చినవాడివి అమలాపురం రాకూడదా ?" అడిగేడు నిష్ఠూరంగా.... తన తండ్రి పోయిన తర్వాత అక్కడి బిజినెస్సంతా తానే చూసుకుంటున్నాననికూడా చెప్పేడు.

బోయ్ కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు.

ఆ అమ్మాయికీ నాకూ చెరో కప్పు అందించి తానోకప్పు తీసు కున్నాడు.

"పెళ్ళయిందా ?" అడిగేడు.

"అయింది ! ఇద్దరు పిల్లలు" చెప్పేను.

"వెరీగుడ్ లైనులో పడిపోయావ్.... నాకు మాత్రం ఇంకా ఎవడూ పిల్లనిస్తానంటూ రావటంలేదు. అందుకే ఇలాంటి పిల్లలకోసం అప్పుడప్పుడూ ఈ ఊరు రావలసి వస్తోంది." నవ్వుతూ అన్నాడు ఆమెను నాకు చూపిస్తూ.

విషయం అర్థమైంది.

"అన్నట్టు ఈ పిల్లెవరో తెలుసా ? ఓసారెప్పుడో నిన్ను తీసు కెళ్ళాను చూడు ? ఆ ఇంటిలో 'లత' అని అప్పట్లో ఒకత్తుండేది. ఇప్పుడు లేదులే ! చచ్చిపోయింది. దాని కూతురే ఇది.... పారిజాతం. ఇవేల్టికి బుక్ చేశాను. తెల్లారేదాకా మనదే ! ఓ పట్టు పడతావేమిటి ? సిగరెట్టు వెలిగించుకుంటూ అడిగేడు రెండు నిముషాల తర్వాత...

వాడి మాటలు వింటూంటే నా ఒంటిమీద తేళ్ళూ జెర్రులూ పాకినట్టనిపించింది. నేను తాగుతున్న కాఫీ వెగటుగా తోచింది. దాన్ని అలాగే వదిలేసి 'లేదురా ! నాకు టయమయింది వెళ్ళాలి !' అని అక్కడినుంచి లేచి వచ్చేశాను.

లత గురించి ఇప్పుడు నేనింక ఏమీ తెలుసుకోనవసరం లేదు...